తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
27 అక్టోబర్ 2025
సంపుటి 69
సంచిక 3
పేజీలు 6
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## తెలంగాణలో నవంబరు 3 నుంచి ప్రైవేట్ కళాశాలల బంద్!



- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేట్ కాలేజీల ఆందోళన
- నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన సమాఖ్య
- ప్రభుత్వం నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని వెల్లడి
- నవంబర్ 1 లోగా బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి డెడ్‌లైన్
- మంత్రులు పట్టించుకోవడం లేదన్న సమాఖ్య ఛైర్మన్ రమేశ్ బాబు
- బకాయిలు చెల్లించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

☞ 2

## మద్యం టెండర్లపై హైకోర్టు తీర్పు రిజర్వ్..

# లాటరీకి గ్రీన్ సిగ్నల్!

- లాటరీ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ
- గడువు పెంచాక వచ్చిన దరఖాస్తులు తుది తీర్పునకు లోబడే
- బంద్ కారణంగానే గడువు పెంచామని ప్రభుత్వ వాదన
- నిబంధనలకు విరుద్ధంగా గడువు పొడిగించారని పిటిషనర్ల ఆరోపణ
- పిటిషనర్లలో కొందరు గడువు పెంచాక దరఖాస్తు చేశారన్న ప్రభుత్వం

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : తెలంగాణలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల దరఖాస్తు గడువు పెంపుపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తన తీర్పును రిజర్వు చేసింది. అయితే, లాటరీ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం, గడువు పొడిగించాక అంటే ఈనెల 19 నుంచి 23 మధ్య వచ్చిన దరఖాస్తుల భవిష్యత్తు మాత్రం తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ పలువురు దరఖాస్తుదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. మద్యం అమ్మకాలపై ప్రభుత్వానికి పూర్తి హక్కు ఉంటుందన్నారు. దరఖాస్తుల చివరి రోజైన 18న బీసీ సంఘాలు బంద్ నిర్వహించడం వల్లే ఎవరికీ ఇబ్బంది ...



☞ 2

## జీహెచ్ఎంసీ 'పెట్ అండ్ ప్లే పార్క్' పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 లో నిర్మాణంలో ఉన్న జీహెచ్ఎంసీ 'పెట్ అండ్ ప్లే పార్క్' పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పలు వివాహ శుభకార్యాలకు హాజరై తిరిగి వస్తున్న సందర్భంలో పార్క్ వద్ద ఆగి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. చెత్తా చెదారంతో నిండిన ఆ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా, పార్క్ నిర్మాణం చేయాలని వారు గతంలో జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పార్క్‌లో జరుగుతున్న పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పార్క్‌లో పనిచేస్తున్న కూలీలను ఆప్యాయంగా పలకరించారు. పనులకు సంబంధించిన వివరాలతో పాటు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.





### బీఆర్ఎస్ చరిత్ర ఈ ఉప ఎన్నికతో

# ముగిసిపోతుంది

- మంత్రి తుమ్మల

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో బీఆర్ఎస్ రాజకీయ సమాధి తప్పదన్న మంత్రి తుమ్మల
- గత బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతి, విధ్వంసమేనని విమర్శ
- హైదరాబాద్‌ను 'మినీ ఇండియా'గా మార్చడమే సీఎం రేవంత్ లక్ష్యమని వెల్లడి
- కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం
- నవీన్ గెలిస్తేనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య
- నవంబర్ 11న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు

తరంగాలు న్యూస్ / డెస్క్, అక్టోబర్ 26: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగబోయే ఉపఎన్నికతో బీఆర్ఎస్ కథకు చరమగీతం పాడబోతున్నామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చారిత్రక తీర్పు ఇచ్చి, బీఆర్ఎస్‌ను రాజకీయంగా సమాధి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు...

మిగతా 2 లో..

## నక్సల్ ఉద్యమానికి మరో ఎదురుదెబ్బ..

### - లొంగిపోయిన 21 మంది మావోయిస్టులు

- దేశంలో మావోయిజం అంతం అవుతోందన్న ప్రధాని మోదీ
- అదే రోజు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 21 మంది మావోయిస్టులు
- లొంగిపోయిన వారిలో కీలక డివిజన్ కమిటీ సభ్యులు
- ఏకే-47 సహా 18 అత్యాధునిక ఆయుధాల అప్పగింత
- ప్రభుత్వ 'పూనా మర్గం' పునరావాస విధానం సత్ఫలితాలు
- 2026 నాటికి నక్సల్ రహిత రాష్ట్రమే లక్ష్యమన్న సీఎం



మిగతా 2 లో..

## కర్నూలు బస్సు విషాదం..

### - బైకర్ మద్యం సేవించి ఉన్నట్టు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడి



- కర్నూలు బస్సు ప్రమాదం... 19 మంది సజీవదహనం
- ప్రమాదానికి కారణం ఓ బైక్
- తొలుత, రోడ్డు ప్రమాదంలో బైకర్ మృతి
- రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్ ను ఈడ్చుకెళ్లి మంటల్లో చిక్కుకున్న ట్రావెల్స్ బస్సు

మిగతా 2 లో..

## మద్యం తాగి బండి నడిపేవారు టెర్రరిస్టులతో సమానం - సీపీ సజ్జనార్

- తాగి బండి నడిపేవారు టెర్రరిస్టులతో సమానం అన్న సజ్జనార్
- 20 మంది మృతికి కారణమైన కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర స్పందన
- తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్లే ఘోరం జరిగిందని వెల్లడి
- హైదరాబాద్‌లో డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు
- పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ఇది పొరపాటు కాదు.. జీవితాలను నాశనం చేసే నేరమన్న సజ్జనార్

2



## దొంగలతో పోరాడిన డీసీపీ చైతన్య ధైర్యం అమోఘం

### - డీజీపీ శివధర్‌రెడ్డి

- దొంగలను పట్టుకునే క్రమంలో గాయపడిన డీసీపీ చైతన్యకుమార్
- యశోదా ఆసుపత్రిలో డీసీపీని పరామర్శించిన డీజీపీ శివధర్‌రెడ్డి
- డీసీపీ ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- చైతన్యకుమార్, గన్‌మ్యాన్ ధైర్యసాహసాలను కొనియాడిన డీజీపీ
- కత్తితో దాడి చేసిన దొంగపై ఆత్మరక్షణ కోసం కాల్పులు
- గాయపడిన దొంగ ఒమర్ అన్సారీకి కూడా చికిత్స

2



# తెలంగాణలో నవంబరు 3 నుంచి ప్రైవేట్ కళాశాలల బంద్!

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 900 కోట్ల బకాయిలను నవంబర్ 1వ తేదీలోగా చెల్లించకపోతే, నవంబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య స్పష్టం చేసింది. ఈ మేరకు సమాఖ్య ఛైర్మన్ ఎన్. రమేశ్ బాబు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం తమకు మొత్తం రూ. 1200 కోట్ల ఫీజు బకాయిలు ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ. 300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని రమేశ్ బాబు తెలిపారు. మిగిలిన రూ. 900 కోట్లను తక్షణమే విడుదల



చేయాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సహకారం అందడం లేదు. మంత్రులు కూడా మా సమస్యలను పట్టించుకోవడం లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే కాలేజీలను నడపడం కష్టమని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని రమేశ్ బాబు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే నవంబర్ 10వ తేదీన సుమారు 2 లక్షల మందితో భారీ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. విచారణల పేరుతో ప్రభుత్వం తమను భయపెట్టాలని చూస్తోందని, పోలీసులను పంపితే ఒక్కరిని కూడా కాలేజీ ప్రాంగణంలోకి అనుమతించబోమని ఆయన తేల్చిచెప్పారు.

# నక్సల్ ఉద్యమానికి మరో ఎదురుదెబ్బ..

## - లొంగిపోయిన 21 మంది మావోయిస్టులు

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : దేశంలో మావోయిజం ముగింపు దశకు చేరుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' 127వ ఎపిసోడ్‌లో వ్యాఖ్యానించిన రోజే, ఛత్తీస్‌గఢ్‌లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. కంకేర్ జిల్లాలోని అంతాగఢ్‌లో 21 మంది కీలక మావోయిస్టులు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పూనా మర్గం' పునరావాస విధానం సత్ఫలితాలు ఇస్తుండటంతో ఈ లొంగుబాట్లు పెరుగుతున్నాయి. లొంగిపోయిన వారిలో నలుగురు డివిజన్ వైస్ కమిటీ సభ్యులు (డీవీసీఎం), తొమ్మిది మంది ఏరియా కమిటీ సభ్యులు (ఏసీఎం), ఎనిమిది మంది పార్టీ సభ్యులు ఉన్నారు. వీరిలో 13 మంది మహిళలు ఉండటం గమనార్హం. కేశ్‌కల్ డివిజన్‌లో కీలకమైన డివిజన్ కమిటీ కార్యదర్శి ముఖేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. వీరంతా ఏళ్లుగా అంతాగఢ్ ప్రాంతంలో హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ క్రియాశీలంగా ఉన్నారు. ఆదివారం ఉదయం బర్రెబెడ గ్రామం నుంచి పోలీసుల బృందం వీరిని స్థానిక క్యాంపునకు తీసుకొచ్చింది. వీరు తమ వెంట ఏకే-47 రైఫిళ్లు మూడు, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్) నాలుగు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, ఆరు .303 రైఫిల్స్‌తో పాటు మొత్తం 18 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వీటి విలువ బ్లాక్ మార్కెట్‌లో రూ. 10 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. సరిగ్గా ఒకరోజు ముందే కమ్టేడా క్యాంపులో 50 మంది నక్సలైట్లు



లొంగిపోవడం గమనార్హం. ఈ పరిణామంపై రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ""పూనా మర్గం - పునరుజ్జీవనానికి పునరావాసం' కార్యక్రమం బస్తర్‌లో మావోయిస్టుల ప్రజా వ్యతిరేక సిద్ధాంతాన్ని కూల్చివేసి, శాంతి, అభివృద్ధికి కొత్త శకాన్ని ప్రారంభించింది. మావోయిస్టుల తప్పుడు వాగ్దానాలతో దారితప్పిన యువత ఇప్పుడు అభివృద్ధి బాట పడుతున్నారు. తుపాకులు వీడి అభివృద్ధి వైపు రావడం గొప్ప మార్పు" అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాత్మక మార్గదర్శకత్వంతోనే ఈ మార్పు సాధ్యమైందని సీఎం తెలిపారు. బస్తర్ ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, మావోయిస్టుల ప్రభావం బలహీనపడిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 'డబుల్ ఇంజిన్' కృషితో 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల గణాంకాల ప్రకారం, ఈ ఏడాది జనవరి 2025 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,200 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. 900కు పైగా ఆయుధాలను అప్పగించారు. మావోయిస్టు సిద్ధాంతాలపై విరక్తి, పెరిగిన భద్రతా బలగాల పట్టు కారణంగానే లొంగుబాట్లు పెరిగాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. లొంగిపోయిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, వృత్తి శిక్షణ ఇచ్చి పునరావాసం కల్పించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

# కర్నూలు బస్సు విషాదం..

## బైకర్ మద్యం సేవించి ఉన్నట్టు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడి

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : కర్నూలు సమీపంలో 19 మందిని బలిగొన్న బస్సు అగ్నిప్రమాద ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి కారణమైన బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. అయితే, బస్సు డ్రైవర్ మద్యం సేవించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దారుణ ఘటనకు బైకర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఫోరెన్సిక్ నివేదికతో పాటు, అతనితో ప్రయాణిస్తున్న స్నేహితుడి వాంగ్మూలం కూడా బలపరుస్తోంది. కర్నూలు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుంచి వచ్చిన నివేదిక ఈ విషయాన్ని ధృవీకరించింది. బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొని మరణించిన బి. శివశంకర్ (22) మద్యం సేవించి ఉన్నాడని ఫోరెన్సిక్ రిపోర్టులో తేలిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం మీడియాకు తెలిపారు. శివశంకర్‌తో పాటు బైక్‌పై ఉన్న అతని స్నేహితుడు ఎర్రిస్వామి కూడా తాము ఇద్దరం మద్యం సేవించామని పోలీసుల ఎదుట అంగీకరించాడు. ప్రమాదం తర్వాత బస్సులో మంటలు చెలరేగడంతో భయంతో అక్కడి నుంచి పారిపోయినట్లు ఎర్రిస్వామి చెప్పాడు. అంతకుముందు శివశంకర్ మృతదేహాన్ని రోడ్డు పక్కకు లాగి, రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను తీసేలోపే వేగంగా వచ్చిన బస్సు దాన్ని ఢీకొట్టిందని వివరించాడు. చిన్నటేకూరు వద్ద రోడ్డుపై పడి ఉన్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టిన బస్సు, దానిని సుమారు 200 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ క్రమంలో బైక్ నుంచి పెట్రోల్ లీక్ అవ్వడం, ఘర్షణ కారణంగా నిప్పురవ్వలు చెలరేగడంతో క్షణాల్లో డబుల్ డెక్కర్ బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ఈ ప్రైవేట్ బస్సులో ఇద్దరు డ్రైవర్లతో సహా 46 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ఘోర దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులతో సహా 19 మంది సజీవదహనం కాగా, ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది అద్దాలు పగలగొట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటనపై ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, వి. కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్ పై నిర్లక్ష్యంగా వ్యవహరించి మరణాలకు కారణమయ్యారన్న ఆరోపణలతో బీఎన్ఎస్ సెక్షన్ 106(1), 125(ఎ) కింద కేసులు పెట్టారు. మరోవైపు, ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు మద్యం తాగి నిర్లక్ష్యంగా బైక్ నడిపినందుకు మృతుడు శివశంకర్‌పైనా ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ లైసెన్స్‌పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కేవలం 5వ తరగతి చదివిన లక్ష్మయ్య, నకిలీ 10వ తరగతి సర్టిఫికెట్‌తో హెవీ వెహికల్ లైసెన్స్ పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రవాణా వాహనం నడపాలంటే కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. అలాగే, బస్సును నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ కోచ్‌గా మార్చడం, డామన్ డయ్యూలో రిజిస్టర్ అయి ఉన్న బస్సును ఈ ఏడాదే ఒడిశాలో రీ-రిజిస్టర్ చేయడం వంటి అంశాలపై కూడా రవాణా శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.

# మద్యం టెండర్లపై హైకోర్టు తీర్పు రిజర్వ్..

## లాటరీకి మాత్రం గ్రీన్ సిగ్నల్!

మొదటిపేజీ తరువాయి..

కలగకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించామని, ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని కోర్టుకు తెలిపారు. పిటిషనర్లలో కొందరు గడువు ముగిశాక దరఖాస్తు చేసి, ఇప్పుడు కోర్టును ఆశ్రయించడం దురుద్దేశంతో కూడుకున్నదే నని వాదించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదిస్తూ.. గడువు పొడిగింపు 2012 ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించడమేనని తెలిపారు. దరఖాస్తుకు రూ. 3 లక్షల నాన్-రిఫండబుల్ ఫీజు ఉంటుందని, గడువు పెంచడం వల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగి, లాటరీలో గెలిచే అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలా, వద్దా అనేదే ఇక్కడ కీలక అంశమని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై తుది తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటివరకు కొత్త దరఖాస్తుల కేటాయింపులు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది.

## బీఆర్ఎస్ చరిత్ర ఈ ఉప ఎన్నికతో

# ముగిసిపోతుంది

### - మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి..

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా విధ్వంసానికి గురైందని ఆరోపించారు. "బీఆర్ఎస్ పాలన అంటేనే అవినీతి, అణచివేత. ఇప్పుడు ఆ పార్టీకి శాశ్వతంగా ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. ఈ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను పూర్తిగా తిప్పికొట్టాలి" అని ఆయన కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని ఒక 'మినీ ఇండియా'గా తీర్చిదిద్దేందుకు అద్భుతమైన దార్శనికతతో పనిచేస్తున్నారని తుమ్మల ప్రశంసించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఈ ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి" అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని మంత్రి



తుమ్మల తెలిపారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన గెలుపుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు నవంబరు 11న పోలింగ్ జరగనుండగా, నవంబరు 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# మద్యం తాగి బండి నడిపేవారు

## టెర్రరిస్టులతో సమానం - సీపీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : మద్యం సేవించి వాహనాలు నడిపేవారు టెర్రరిస్టులతో సమానమని సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై వారి చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా ఏమాత్రం తక్కువ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 20 మంది ప్రాణాలను బలిగొన్న కర్నూలు బస్సు ప్రమాదం నిజానికి ప్రమాదం కాదని, అది ఒక తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన దారుణ మారణకాండ అని ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. కర్నూలు ప్రమాద ఘటన వివరాలను సజ్జనార్ పంచుకున్నారు. బి. శివ శంకర్ అనే బైకర్ మద్యం మత్తులో తన బైక్‌పై నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 2:24 గంటలకు ఓ పెట్రోల్ బంకులో బైక్‌లో ఇంధనం నింపుకున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నమోదయ్యాయని, సరిగ్గా 2:39 గంటలకు ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు. అతని బాధ్యతారాహిత్యం క్షణాల్లో ఎన్నో కుటుంబాలను సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "మద్యం తాగి వాహనాలు నడిపేవారు ప్రతీ విషయంలోనూ టెర్రరిస్టులే. నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను. వారు ప్రాణాలను, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తారు. ఇలాంటి చర్యలను ఎప్పటికీ సహించబోం," అని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇకపై హైదరాబాద్‌లో డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సజ్జనార్ ప్రకటించారు. మద్యం మత్తులో పట్టుబడిన ప్రతి ఒక్కరూ చట్టం యొక్క పూర్తి పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. అమాయకుల జీవితాలను ప్రమాదంలో పడేసే వారి పట్ల ఎలాంటి కనికరం, మినహాయింపులు ఉండవని తేల్చిచెప్పారు. డ్రంక్ డ్రైవింగ్‌ను ఒక పొరపాటుగా చూడటం సమాజం మానుకోవాలని, అది జీవితాలను నాశనం చేసే నేరమని, దానికి తగ్గ శిక్ష కచ్చితంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# దొంగలతో పోరాడిన డీసీపీ చైతన్య

## ధైర్యం అమోఘం - డీజీపీ శివధర్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 26 : చాదర్‌ఘాట్‌లో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకునే ప్రయత్నంలో గాయపడిన డీసీపీ చైతన్యకుమార్‌ను, ఆయన గన్‌మ్యాన్‌ను తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో కలిసి సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రికి వెళ్లిన ఆయన, చికిత్స పొందుతున్న డీసీపీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ చైతన్యకుమార్‌తో మాట్లాడారు. ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, డీసీపీ చైతన్యకుమార్ ఆరోగ్యం నిలకడగా ఉందని, మెరుగుపడుతోందని తెలిపారు. "సోమవారం ఆయన్ను డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. డీసీపీ చైతన్యకుమార్ ఒక ఆదర్శవంతమైన అధికారి. విధి నిర్వహణలో భాగంగా ఆయన చూపిన చొరవ, ధైర్యసాహసాలు ప్రశంసనీయం. దొంగ చేతిలో కత్తి ఉందని తెలిసినా వెనకడుగు వేయకుండా అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆయనతో పాటు గన్‌మ్యాన్ కూడా అంతే ధైర్యాన్ని ప్రదర్శించారు. పోలీస్ శాఖ తరపున వారిద్దరినీ అభినందిస్తున్నాం" అని డీజీపీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ ప్రాంతంలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న



ఒమర్ అన్సారీ అనే వ్యక్తిని పట్టుకోవడానికి డీసీపీ చైతన్యకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో నిందితుడు కత్తితో డీసీపీపై దాడికి యత్నించాడు. ఆత్మరక్షణ కోసం డీసీపీ కాల్పులు జరపగా, నిందితుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో డీసీపీతో పాటు ఆయన గన్‌మ్యాన్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన దొంగ ఒమర్ అన్సారీకి కూడా ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని డీజీపీ తెలిపారు. చైతన్యకుమార్ వంటి అధికారుల వల్లే సమాజంలో భద్రతాభావం పెరుగుతుందని, వారి చర్యలు పోలీస్ బలగాలకు స్ఫూర్తినిస్తాయని శివధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంపీ కావ్య కు పాలాభిషేకం



తరంగాలు, జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 26 : తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జఫర్గడ్ మండలానికి పంచాయతీ రాజ్ హ్యామ్ రోడ్ల కు నిధుల మంజూరు చేయడం జరిగింది. మండలంలోని తిడుగు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య, ఫ్లెక్సీ లకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్‌తో డిఆర్ కళాశాల అవగాహన సదస్సు



మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 26, తరంగాలు : హైదరాబాద్‌లోని డిఆర్ కళాశాల ప్రతినిధులు మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గండు మురళి ఆధ్వర్యంలో సమావేశ-మయ్యారు. కళాశాల విద్యార్థులకు అందిస్తున్న విద్యా సేవలు మరియు వసతి గురించి కళాశాల ప్రతినిధులు వివరించారు. డిఆర్ కళాశాల డైరెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కట్టుబడి ఉంది. విద్యార్థుల సౌకర్యం మరియు సంక్షేమం కోసం హాస్టళ్లతో సహా కళాశాల మౌలిక సదుపాయాలను వివరించారు. ఉపాధ్యాయుల సంఘానికి మద్దతు ఇవ్వడానికి డిఆర్ కళాశాల సిద్ధంగాఉంది. అనంతరం మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు గండుమురళి, డిఆర్ కళాశాల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# తాళ్లపూసపల్లి గ్రామంలో ఇంట్లో చోరీ..





కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్. 26, తరంగాలు : కేసముద్రం మండలంలోని తాళ్లపూస పెల్లి గ్రామంలో ఓ నిరుపేద ఇంట్లో చోరీ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన కథనం ప్రకారం అనసూర్య (50) రోజువారి విద్య దినసరి కూలి పనులు చేసుకుంటుంది శనివారం రాత్రి సమ-యంలో అనసూర్య ప్రక్క ఇంటి వద్ద పడుకోగా ఆమె ఇంట్లో లేనిది గమనించి గుర్తుతెలియని దొంగలు తన ఇంట్లోకి ప్రవేశించి 5.6 తులాల బంగారు ఆభరణాలు, 17 కులాల వెండి పట్టీలు దొంగిలించడం జరిగిందని బాధితురాలు అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వికలాంగుల కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య

జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 26,(తరంగాలు) : వికలాంగుల కాలనీకి కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గుడిసెల కాలనీలో సిపిఎం గుడిసెల శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మాట్లాడుతూ వికలాంగుల కాలనీలో ప్రధాన సమస్యలు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం అందించాలి .అంతర్గత రోడ్లు నిర్మాణం చేయాలి అని అన్నారు. అనేక సంవత్సరాలుగా వికలాంగులు గుడిసెలు వేసుకోవడం స్థిరనివాసం ఉండడం జరుగుతుంది. పాలకులు వికలాంగుల కాలనీ పట్టించుకోవ డంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వికలాంగుల కాలానికి కనీస సౌకర్యాలు, నీటి సౌకర్యం అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాట సుధాకర్, శాఖ కార్యదర్శి తాటికల



రేణుక, గబ్బెడ కొమరయ్య, కమిటీ సభ్యులు ముత్యాల కోమల, ఆకోజి రజిత, దుద్దుల స్వామి, దుద్దుల లక్ష్మి నారాయణ, బొడ్డు అనిత, కత్తుల రహిత, తదితరులు పాల్గొన్నారు.

# చల్లా పరామర్శ..





సంగెం అక్టోబర్ 26 (తరంగాలు) మండలంలోని గుంటూరుపల్లి, గవిచర్ల, తిమ్మాపూర్ గ్రామాలలో ఇటీవలే వివిధ కారణాలతో మృతిచెందిన గార్లపాటి హరి ప్రసాద్ రావు, కుడికాల రమేష్, కోడూరి ఎల్లమ్మ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న గ్రామపార్టీ అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, మాజీ సర్పంచి మాదినేని రాంరెడ్డి, అడ్డగట్ల విజయ్‌లను చల్లా ధర్మా రెడ్డి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయ కులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగ పాణి, మాజీ జెడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, బుక్క మల్లయ్య, వేల్పుల కుమార స్వామి, సుతారి బాలకృష్ణ, మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పెనుగొండ మూల మైసమ్మ ప్రతిష్టాపన

- ముఖ్యపాత్ర పోషించిన ఆటో యూనియన్
- కుల మత బేధం లేకుండా పాల్గొన్న ప్రజలు
- అమ్మకోసం స్వచ్ఛందంగా వచ్చిన విరాళాలు
- చందాలు, దాతల సాయంతో మైసమ్మ తల్లికి ఏర్పడిన సన్నిధి
- వేద మంత్రాల నడుమ ఆలయంలో కొలువుదీరిన మూలమైసమ్మ
- మొక్కులు చెల్లించుకున్న పెనుగొండ ప్రజలు
- అందరిని చల్లంగా కాపాడాలంటూ వేడుకోలు





కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్. 26, తరంగాలు : మానుకోట జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో అత్యంత వైభవంగా మూల మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. అనాదిగా మైసమ్మని కొలుస్తున్న ప్రజలు తాజాగా నూతన గుడి నిర్మించి విగ్రహ ప్రతిష్ట నిర్వహించినట్టు పెనుగొండ ఆటో యూనియన్ తెలిపింది. గ్రామంలో కొన్ని ఏండ్లుగా మూల మైసమ్మని కొలుస్తున్నారు. చుట్టుపక్కల చెలక వాళ్ళు, ఆటో కార్మికులు అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తువస్తున్నారు. మొన్నటి వరకు ఓ చెట్టు కింద ఉన్న అమ్మవారు.. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా.. ఆ దారి వెంట పోయే ప్రయాణికులు క్షేమంగా గమ్య స్థానాలకి పంపించే అమ్మగా.. ముఖ్యంగా పెనుగొండ ఆటో యూనియన్ కార్మికులు చల్లని తల్లిగా కొలుస్తూ వస్తున్నారు. ఇదే తరుణంలో వానకి తడుస్తూ, ఎండకి ఎండుతూ ఉన్న తల్లికి.. ఓ గుడి నిర్మించాలని నిర్ణయించిన ఆటో యూనియన్.. అనుకున్నదే తడవుగా ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామంలో విరాళాలు సేకరించడమే కాక.. ప్రతీ ఆటో కార్మికుడు ముందుపడి వాళ్లకు తోచిన సాయం చేసి, ప్రజల నుండి చందాలు సేకరించారు. వచ్చిన నగదుతో అమ్మవారికి గుడి నిర్మాణం చేపట్టి పూర్తి చేసారు. శ్యామ్ ప్రసాద్ అమ్మసన్నిధికి స్థలం ఇవ్వగా.. శివతార అమ్మవారి విగ్రహాన్ని అందించారు. కేసముద్రంకి చెందిన సమ్మిగౌడ్ ఫౌండేషన్ వారు దేవాలయానికి గ్రిల్స్ అందించగా, దుబాకుల వెంకన్న బెస్మెంట్, పిల్లర్స్ లెవల్ వరకు సొంతంగా పనులు చేపట్టారు. అలా మొదలు పెట్టిన కార్యంలో గ్రామంలోని ప్రజలు, పూర్వ ప్రముఖులు, చిన్నలు, పెద్దలు అన్నీ రాజకీయ పక్షాలు, కులాలు, మతాలకి అతీతంగా ఈ అమ్మవారికీ విరాళం ఇచ్చి ఆలయ నిర్మాణానికి తొడ్పాటును అందించారు. సర్వాంగా సుందరంగా నిర్మాణమైన అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్టను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి.. ఇంటింటి నుండి మంగళహారతులు ఇచ్చి అమ్మకి స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రాలనడుమ అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పెనుగొండ ఆటో యూనియన్ నేతలు.. సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కుల మత బేదాభిప్రాయం లేకుండా గ్రామ ప్రజలు పౌరులు ఈ కార్యంలో పాలు పంచుకున్నట్టు ఆటో యూనియన్ వెల్లడించింది. వంద రూపాయలు మొదలు వేల రూపాయల వరకు అమ్మవారికి విరాళం వచ్చినట్టు చెప్పారు. అత్యంత వైభవోపేతంగా హెూమాలు నిర్వహించినట్టు ఆటో యూనియన్ తెలిపింది. ప్రతిష్ట కార్యక్రమంలో ఆటోయూనియన్ కార్మికులు, గ్రామ ప్రజలు, పెద్దలు చిన్నలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- ❖ భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి
- ❖ రేషన్ కార్డు పై 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలి
- ❖ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి గొడిశాల వెంకన్న



కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 26, తరంగాలు : 1948 కనీస వేతనాల చట్ట ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఓసారి పెరిగిన ధరలు సామాజిక ఆర్థిక పరిస్థితుల ఆధారంగా కనీస వేతనాల చట్టాన్ని సవరించి వ్యవసా-య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోడిశాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 26 ఆదివారం రోజున కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామంలో వ్యవసాయ కూలీల సమావేశం జరిగింది సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ నిరుపేదలైన భూమిలేని కూలీలకు ఇంద్రమాత్మీయ భరోసా కింద ప్రతి ఏటా 12000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసిందని కానీ ఇప్పుడు ఉపాధి పనులు 20 రోజులు చేసిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందని చెప్పడం విడ్డూరంగం ఉందన్నారు రేషన్ కార్డులపై 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని జాబ్ కార్డు ఉన్న వాళ్ళందరికీ పని కావాలని కోరిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు వ్యవసాయ కార్మికులకు సంక్షేమానికి ప్రత్యేక లేబర్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేయాలని 57 సంవత్సరాల నిండిన ప్రతి కార్మికునికి నెలకు 5000 పెన్షన్స్ వికలాంగుల వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళల గీతా నేత వృత్తిదారులకు పెన్షన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 28 నుంచి నవంబర్ 10 వరకు సంఘం గ్రామసభలు నిర్వహిస్తామని కార్మికులంతా సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మికుల సంఘం నాయకులు నా రెడ్డి నారాయణ సమ్మిటి సక్కులు మంచు విజయ పద్మ ఉప్పలమ్మ రాములు శేఖర్ పాల్గొన్నారు.

# రైతు నేస్తం - 2025 పురస్కారం అందుకున్న జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న



మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్.26, తరంగాలు: ఆదివారం స్వర్ణ భారతి ట్రస్ట్, ముచ్చింతల్, శంషాబాద్, హైదరాబాద్ నందు రైతు నేస్తం అవార్డ్ కార్యక్రమం లో భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు , తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ , ఉద్యాన, అనుబంధల శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎడిటర్ రైతు నేస్తం యండపల్లి వెంకటేశ్వరావు (పద్మశ్రీ అవార్డ్ గ్రహీత) చేతుల మీదుగా అధికారి అందించిన సేవలకు గాను జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమ అధికారి, జినుగు మరియన్న మహబూబాబాద్ రైతు నేస్తం - 2025 పురస్కారాన్నీ అందుకన్నారు. రైతులకు సేవ, నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ పంట మార్పిడి ద్వారా ఉద్యాన పంటల విస్తరణ, రైతులు పలు మేలైన యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, రైతుల విజయ గాధలు మొదలైన విషయాలను తెలియజేస్తూ ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూలు, మల్బరీ, మునగ మొదలైన పంటల విస్తరణకు రైతులకు అవగాహన చేస్తూ, 30 (ముప్పై) వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ చేసినందుకు మరియు ఉద్యాన పంటలు కూడా 10 (పది) వేల ఎకరాల విస్తరణ చేసినందుకు వారి సేవలను గుర్తిస్తూ విస్తరణ విభాగంలో రైతు నేస్తం - 2025 పురస్కారాన్నీ అందుకున్నారు.

# శబరిమలై మహా పాదయాత్ర

- ❖ మెదక్ నుండి శబరిమలై వరకు శరణు ఘోష తో శబరిమలై యాత్ర
- ❖ అడుగడుగునా స్వామి శరణు ఘోష మంత్రం
- ❖ శరణు ఘోష చెప్పకుండా యాత్ర నీకు సాధ్యమా



తరంగాలు మెదక్ జిల్లా అక్టోబర్ 26 : మెదక్ జిల్లా మెదక్ పట్టణంలో శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో ముగ్గురు వ్యక్తులు అయ్యప్ప మాల ధరించి గురుస్వామి రాజు పంతులు గురుస్వామి వీరి ముగ్గురికి ఇరుముడి కట్టి శబరిమలై మహా పాద యాత్ర కు అనుమతి ఇవ్వడంతో మాల ధరించిన సంగమేశ్వర్ చంద్రశేఖర్ ప్రభు గౌడ్ 41 రోజుల పాటు పాద యాత్ర కొనసాగుతుందని దారి మధ్యలో హైదరాబాద్ బేగంపేట లో అయ్యప్ప సమాజం నుండి మరో 150 మంది స్వాములతో కలిసి పెద్ద పాదం ద్వారా అలుదానది నుండి కరిమల గుండా స్వామి శరణు ఘోష తో పంబ చేరుకుని అక్కడే పంబానదిలో స్నానం చేసుకుని అక్కడి నుండి ఇరుముడి తో శబరిమలై చేరుకుని పదునెట్టాంబడి (18 మెట్లు) అధిరోహించి హరిహర పుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి ని దర్శించుకుని స్వామి వారి కి నేయ్యాభిషేకం సమర్పించి తిరుగు ప్రయాణం తాము ముందు అనుకున్న విధంగా మెదక్ పట్టణంకు చేరుకుంటారు

# పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు



తరంగాలు, సంగారెడ్డి, అక్టోబర్ 26 : జహీరాబాద్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి పదకొండు మంది వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 59,500/- నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు, జహీరాబాద్ పరిదిలో ఆర్య నగర్ కాలనీలోని మంగలి దత్తు ఇంటిలో పదకొండు మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. దీంతో జహీరాబాద్ టౌన్ ఎస్సై వినయ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్ట రిత్యా చర్య తిసుకుంటామని తెలిపారు.

# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన నాయకులు



నర్సంపేట అక్టోబర్ 26 తరంగాలు : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన 127 వ మన్ కి బాత్ కార్యక్రమాన్ని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు బిజెపి నియోజకవర్గ స్థాయి నాయకులు మండల స్థాయి నాయకులు యూత్ నాయకులు వీక్షించారు.

# బీ ఆర్ ఎస్ నాయకుల పరామర్శ



నర్సంపేట అక్టోబర్ 26 తరంగాలు : నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కంకణాల రాజు తల్లి కంకణాల వీరమ్మ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ నాయకులు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్న పెల్లి నర్సింగ్గం మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమరయ్య బండారి శ్రీలత రమేష్ మాజీ సర్పంచ్ రాయపు రెడ్డి న్యాయవాది పార్టీ క్లస్టర్ ఇన్చార్జి మోటూరి రవి రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు అల్లి రవి సీనియర్ నాయకులు బండారి మల్లయ్య రమేష్ గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిగా హరీష్ యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గజ్జి శ్రీరామ్ పిఎసిఎస్ డైరెక్టర్ ఎడ్ల రవీందర్ మాజీ ఎస్ఎంసి చైర్మన్ కొమ్మ రవి మార్ద నవీన్ పోశాల బిక్షపతి మనోహర్ వెంకటేశ్వర్లు ఆకుల అశోక్ మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దూడల ప్రకాష్ మాజీ వార్డు సభ్యులు పత్రి రజిని అశోక్ సీనియర్ నాయకులు రాజమౌళి యశోద నర్సింగ్గం సుధాకర్ నరసయ్య ద్యాగల సంపత్ సున్నపు లక్ష్మయ్య తో పాటు తదితరులు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారం



తరంగాలు సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 26 : యువ నేత, రైతు మరియు బీజేపీ టౌన్ అధ్యక్షుడు (జహీరాబాద్-2) రమేశ్ రెడ్డి బసంతపూర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా యువ మోర్చా (బీజేఎంయం) బృందంతో కలిసి పాల్గొన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి పాయల్ శంకర్, ఎమ్మెల్యే, నాయకత్వం వహించగా, బీజేఎంయం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ గణేష్ కుందే మరియు బీజేఎంయం అధికార ప్రతినిధి శ్రీ శివశంకర్ పాల్గొన్నారు. బృందం స్థానిక య-ువతతో, ప్రజలతో కలసి బీజేపీ పార్టీ అభిప్రాయాలు, అభివృద్ధి దిశలో పార్టీ సంకల్పాన్ని తెలియజేశారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ రమేశ్ రెడ్డి బసంతపూర్, బీజేపీ యువతకు ప్రేరణగా నిలుస్తోందని, అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సేవ అనే విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణలో బీజేపీని మరింత బలపర్చేందుకు యువత చురుకుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి బీజేఎంయం కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా స్పందించి, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీకి పెరుగుతున్న మద్దతును ప్రతిబింబించారు.

# బీసీ రిజర్వేషన్ పై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి



వర్ధన్నపేట, అక్టోబర్ 18,తరంగాలు : బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి కొనసాగిస్తుందని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బీసీ బిల్లు కోసం చేపట్టిన బంధు కార్యక్రమానికి వర్ధన్నపేట బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపి బందులో పాల్గొనడం జరిగింది. వ్యాపార సంస్థలు, పాఠశాలలు, వాహనదారులు, స్వచ్ఛందంగా బందులో పాల్గొని సంఘీభావం తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్చార్జి చింతల యాదగిరి,మండల పార్టీ అధ్యక్షులు తూళ్ళ కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్,మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, వైస్ ఎంపీపీ చోప్పరి సోమయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్ రెడ్డి,మాజీ సర్పంచ్ పెంచాలా.కుమారస్వామి, మాజీ దేవ-స్థానం చైర్మన్ సిల్వర్ కుమార, సీనియర్ నాయకులు తుమ్మల.యాకయ్యా, ఎంపీటీసీ గోదిషల.శ్రీనివాస్,మాజీ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, పూజారి రఘు, బాణోతు శ్రీను, అంబటి యెల్లాస్వామి, కన్జర్ల రవీందర్,ఎండి రహీం, పానుగోటి.చందర్ రావు,గజ్జెల.నవీన్, మన్నూరు సోము,భూక్య రామన్న,పిట్టల రాజు,మైస వీరేందర్, తదితరులు పాల్గొన్నారు

# బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉంది





జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 18, (తరంగాలు) : బీసీ బిల్లులు ఆమోదింపజేసి, బీజేపీ నేతలు తమ చిత్తశుద్ధి చాటుకోవాలి స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు జఫర్గడ్ మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ బంద్ కార్యక్రమంలో పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య ఈ సందర్భంగా మంచాల ఎల్లయ్య మాట్లాడుతూబీసీ రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు.బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం అన్నివిధాలుగాపోరాడుతాం.రాజకీయాలు ఎన్నికల వరకే రిజర్వేషన్ల విషయంలో అందరం ఏకం కావాల్సిన అవశ్యకత ఉంది.రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారు.బీసీ బంద్ తో బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ గారు దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన జరగాలనే అంశాన్ని స్పష్టంగా ప్రస్తావించడం జరిగింది.ఆ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టింది. స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కల్పించేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేసింది. ఇది బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ యొక్క నిజమైన చిత్తశుద్ధికి నిదర్శనం.ఈ కార్యక్రమంలో బిక్షపతి మోహన్ రావు యాకయ్య,రాజు, ఇల్లందల బాబు, శ్రీధర్, కుమార్, మొగిలి, అనిల్, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నియోజక వర్గ ముఖ్య నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, బీసీ సంఘం,వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించిన అదనపు ఎస్పీ మహేందర్







తరంగాలు మెదక్ జిల్లా అక్టోబర్ 26 : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు మెదక్ టౌన్‌లో పోలీస్ అమరవీరుడు ఎస్బి హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య కుటుంబాన్ని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మహేందర్ ముందుగా అమరవీరుడు పెంటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి ఆరోగ్యం జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పోలీసులు ఎల్లప్పుడూ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. 1997 నవంబర్ 17వ తేదీన నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకొని విధి నిర్వహణలో బయలుదేరిన సందర్భంలో శివ్వంపేట్ మండలం లోని పిలుట్ల వద్ద జరిగిన బాంబు దాడిలో అప్పటి తూప్రాన్ డియస్పి యం. బాల సుబ్రహ్మణ్యం తూప్రాన్ సీఐ వెంకటస్వామి ఎస్బి హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య శివంపేట్ కానిస్టేబుల్ లు లక్ష్మణ్ నాయక్ శ్రీనివాస్ రావు సుజాయత్ అలీ దాడిలో వీరమరణం పొందారు. విధి పట్ల కట్టుబాటుతో ప్రాణత్యాగం చేసిన వారి సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు.అమర వీరుల త్యాగాన్ని స్మరించు కుంటూ జిల్లా పోలీసులు ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుల కుటుంబాల ను పరామర్శించడం ద్వారా వారి సేవలను గుర్తు చేసుకుంటారని తెలిపారు. మీరు కూడా మా పోలీస్ కుటుంబంలో భాగమే. ఎలాంటి సమస్యలైనా నిరభ్యంతరంగా పోలీస్ అధికారులను సంప్రదించాలని వారి కుటుంబ సభ్యులను తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్ మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లపై రేగోడ్ పోలీస్ ల ఉక్కు పాదం.

- ❖ పేకాట రాయుళ్లపై రేగోడ్ పోలీస్ ల ఉక్కు పాదం.
- ❖ యువకులు పేకాట మోజులో పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దు
- ❖ ఆల్లాదుర్గ్ సర్కిల్ పరిసరాలలో జూదం ఆడే వారిపై కఠినమైన చర్యలు తప్పవు
- ❖ 19 మంది పై కేసు నమోదు 2 లక్షల 19 వేలు కారు బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ❖ అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి



తరంగాలు మెదక్ జిల్లా అక్టోబర్ 26 : నిన్న సాయంత్రం కొండాపూర్ గ్రామ శివారు లో ఒక షెడ్డులో రేగోడ్ పోలీసులు జరిపిన రైడ్ లో పటాన్ చేరు కు చెందిన నందు మరియు లవ్య రోహిత్ లు హైదరాబాద్ పటాన్ చేరు శంకర్పల్లి జనవాడ చేవెళ్ల అల్వాల్ ప్రాంతంలో నివసిస్తున్న కొందరు యువకులను పేకాట ఆడించగ వారిని పట్టుకొని ఇక్కడ పేకాట ఆడుతున్న 19 మంది యు-వకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది ఇట్టి కేసులో నగదును 2,19,000/- సెల్ ఫోన్లు కారు ఆటో బైక్ అన్నిటిని స్వాధీన పరచుకుని కోర్టులో డిపాజిట్ చేయడం జరుగుతుంది. మెదక్ జిల్లాలో ఎక్కడ పేకాట ఆడిన గట్టి చర్యలు తీసుకోబడును అని జిల్లా ఎస్పీ కూడా చెప్పడం జరిగింది. పేకాట ఆడుకోవడానికి సహకరించిన స్థలమిచ్చిన వ్యక్తులపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుంది అట్టి ప్రదేశాన్ని ఆర్డిఓ అనుమతి తీసుకుని సీజ్ చేయడం కూడా జరుగుతుంది. యువకులు పేకాట మోజులో పడి, కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకుంటు న్నారు అని యువకులందరూ క్రమశిక్షణతో మెలగాలని సిఐ రేణుక రెడ్డి తెలపడం జరిగింది. రేగోడ్ మండలం మరియు ఆల్లాదుర్గ్ సర్కిల్ పరిసరాలలో జూదం ఆడే యువకులపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించడం జరిగింది.

# అత్యంత పారదర్శకంగా మద్యం లాటరీ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు

- ❖ పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్ లో లాటరీ సిస్టం
- ❖ 49 మద్యం షాపులకు లాటరీ కార్యక్రమం నిర్వహణ
- ❖ మద్యం పాలసీ లాటరీ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- ❖ జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు 49 దరఖాస్తులు వచ్చినవి 1420
- ❖ దరఖాస్తు ల ద్వారా 42 కోట్ల 60 లక్షల రూపాయలు ఆదాయం
- ❖ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





తరంగాలు మెదక్ జిల్లా అక్టోబర్ 26 : ఆదివారం మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ బోధన్ రోడ్ మెదక్ ఫంక్షన్ లాటరీ నిర్వహణ ఏర్పాటులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 - 27 సంవత్సరాలకు మెదక్ జిల్లా లోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ తేదీ 23.10.2025 రోజున ముగిసిందని తెలిపారు. మెదక్ జిల్లాలోని మొత్తం (49) మద్యం షాపులకు గాను (1420) దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తు ఫీజు రూపంలో 42 కోట్ల 60 లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం జరిగింద న్నారు. 27.10.2025 సోమవారం రోజున మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ లో బోధన్ రోడ్ మెదక్ ఫంక్షన్ హాల్ నందు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ తేదీ 27.10.2025 సోమవారం రోజున ఉదయం 9.30 గంటలకల్లా శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ నందు హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రసీదు తో పాటు ఎంట్రీ పాస్ ఒరిజినల్ ను తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని కోరారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నారా రోహిత్ పెళ్లి వేడుకలు షురూ..



టాలీవుడ్ హీరో నారా రోహిత్ వివాహం ఈ నెల 30న జరగనున్న సంగతి తెలిసిందే. 'ప్రతినిధి 2' సినిమాలో కలిసి నటించిన శిరీషను ఆయన వివాహమాడనున్నారు. ఇప్పటికే వీరి వివాహ వేడుకలు మొదలయ్యాయి. శనివారం హల్దీ వేడుక జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# మెగాస్టార్ చిరంజీవిని కలిసిన తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు

తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎఫ్‌జేఏ) నూతనంగా ఎన్నికైన సభ్యులు నిన్న మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు సంస్థ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి చిరంజీవికి వివరించారు. ప్రధానంగా సినీ జర్నలిస్టుల కోసం హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ పాలసీ వంటి పథకాలు అమలులో ఉన్నాయని, ప్రమాదం లేదా అనారోగ్యం సంభవించినప్పుడు తక్షణ సహాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని టీఎఫ్‌జేఏ సభ్యులు తెలిపారు. అలాగే భవిష్యత్తులో జర్నలిస్టుల కోసం హౌసింగ్ సొసైటీ, క్లబ్ హౌస్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా వారి కార్యక్రమాల గురించి తెలుసుకున్న చిరంజీవి అసోసియేషన్ ప్రతినిధులను అభినందిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీఎఫ్‌జేఏ అధ్యక్షుడు వై.జె. రాంబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాదం రఘు, కోశాధికారి సురేందర్ కుమార్ నాయుడు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను టీఎఫ్‌జేఏ తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్ లో పోస్ట్ చేసింది.



# రవితేజ 'మాస్ జాతర' సెన్సార్ పనులు పూర్తిలు




రవితేజ కథానాయకుడిగా, భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించగా, సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలుగా వ్యవహరించారు. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్ పొందింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ చిత్ర బృందం నూతన పోస్టర్‌ను విడుదల చేసింది. "మాస్, ఫన్, యాక్షన్ అన్నీ ఒకే చోట! వినోదాత్మక మాస్ వేవ్‌ను థియేటర్లలో ఆస్వాదించండి" అంటూ పోస్టర్‌లో పేర్కొన్నారు. సినిమా నిడివి 160 నిమిషాలుగా నిర్ణయించబడగా, అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అదే రోజు ప్రీమియర్స్ ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన అనుమ తుల కోసం చిత్ర బృందం ప్రయత్నాలు చేస్తోంది. 'ధమాకా' చిత్రం తర్వాత రవితేజ - శ్రీలీల జంటగా నటించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రవితేజ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా, 'మాస్ జాతర' ట్రైలర్‌ను అక్టోబర్ 27న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

# హైదరాబాద్‌లో ప్రారంభమైన వరుణ్ తేజ్ సినిమా నాలుగో షెడ్యూల్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాత్కాలికంగా #VT15 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం, తాజాగా హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ లోకి అడుగుపెట్టింది. ఇది సినిమాకు సంబంధించిన నాలుగో షెడ్యూల్ అని, ఇందులో వరుణ్ తేజ్‌పై పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మూడు షెడ్యూళ్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను కొరియాలో చిత్రీకరించింది. గత జూన్‌లో వరుణ్ తేజ్ కొరియా వెళ్లగా, అక్కడ హీరోతో పాటు ప్రధాన తారాగణంపై వినోదాత్మక, ఉత్కంఠభరిత సన్నివేశాలను షూట్ చేసినట్లు నిర్మాణ సంస్థ గతంలో వెల్లడించింది. అంతకుముందు హైదరాబాద్‌లో తొలి షెడ్యూల్, అనంతపురంలో రెండో షెడ్యూల్ పూర్తి చేశారు. అనంతపురంలోని కియా గ్రౌండ్స్‌తో పాటు పలు అందమైన పల్లెటూరి లొకేషన్లలో చిత్రీకరణ జరిపారు. కథకు అనుగుణంగా వరుణ్ తేజ్, హీరోయిన్ రితికా నాయక్‌పై ఓ అద్భుతమైన పాటను కూడా అక్కడ చిత్రీకరించినట్లు తెలిసింది. హారర్, కామెడీతో పాటు థ్రిల్ అంశాలు కూడా ఈ సినిమాలో పుష్కలంగా ఉంటాయని తెలుస్తోంది. వరుణ్ తేజ్ పుట్టినరోజున ఈ చిత్రాన్ని ప్రకటించినప్పటి నుంచి సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఒక భారతీయ నటుడు ఇండో-కొరియన్ చిత్రంలో నటించడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో రితికా నాయక్, సత్య, మిర్చి కిరణ్ వంటి నటీనటులు తమ కామెడీ టైమింగ్‌తో అలరించనున్నారని సమాచారం. సౌత్ ఇండియా స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, పనీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

# ఈ హద్దులు చెరిగిపోవాలని ఆశిస్తున్నా - ప్రియమణి

ప్రముఖ నటి ప్రియమణి దక్షిణాది చిత్ర పరిశ్రమకు లభిస్తున్న ఆదరణపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రాంతీయ చిత్రాలను పట్టించుకోని ప్రేక్షకులు ఇప్పుడు వాటిని ఎంతగానో ఆదరిస్తున్నారని, ఈ మార్పు తనకు గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రాంతీయ, హిందీ చిత్రాల మధ్య ఉన్న అడ్డుగోడలు నెమ్మదిగా తొలగిపోతున్నాయని, భవిష్యత్తులో ఈ సరిహద్దులు పూర్తిగా చెరిగిపోవాలని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ.. "ప్రేక్షకులు ఇప్పటికైనా దక్షిణాది సినిమాలను చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఎప్పటినుంచో ఇక్కడ మంచి సినిమాలు వస్తున్నాయి, కానీ వాటికి గతంలో సరైన ప్రాధాన్యత దక్కలేదు. ప్రతి భాషలోనూ అద్భుతమైన చిత్రాలు రూపొందినా, వాటి గురించి మాట్లాడేవారు కూడా కాదు. కానీ ఇప్పుడు అలాంటి చిత్రాలే భారీ విజయాలు సాధించడం నిజంగా గొప్ప విషయం" అని తెలిపారు. సినిమాలతో పాటు వాటి వెనుక ఉన్న దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల గురించి కూడా చర్చించుకోవడం పరిశ్రమకు ఎంతో మంచిదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సానుకూల మార్పు ఎంతో అవసరమని, ఇది తనకు సంతోషాన్ని కలిగిస్తోందని వివరించారు. ప్రస్తుతం ప్రియమణి తన సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా విభిన్న పాత్రలతో మెప్పిస్తున్నారు. తెలుగులో ఆమె చివరిగా 'కస్టడీ' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం హిందీ, తమిళ భాషల్లో నటిస్తున్న ఆమె, త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న పాపులర్ వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్-3'లో కీలక పాత్రలో కనిపించనున్నారు.



Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com